# హక్కులు కోల్పోతున్న గిరిజనులు

1. గిరిజన జనాభా అధికమైన గ్రామాలను షెడ్యూల్డు ప్రాంతాలలో చేర్చాలి.

2. 70 చట్టం అమలుకు గట్టి ప్రయత్నాలు చేయాలి.

3. సెటిల్‌మెంట్ పట్టాలను రద్దుచేసే అధికారాలను జిల్లా కలెక్టర్లకు ఇస్తున్నట్లు వెంటనే ప్రకటించాలి.

భూముల బదలాయింపు నిషేధ చట్టాన్ని రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూలులో చేర్చాలి.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంఘం
C/o. శక్తి, రంపచోడవరం.

1988

రాష్ట్రంలో గిరిజన ప్రాంతంలోకి (షెడ్యూల్డు ఏరియా) వలస పోయిన గిరిజనేతరులకు మేలుచేయాలనే ఉద్దేశ్యం మన ముఖ్యమంత్రిలో బలంగా నాటుకుంది. దానితో గిరిజనులను ఆయన సవతితల్లి ప్రేమతో చూస్తున్నారు.

## గిరిజనులకు బంజర్ల సమారాధన

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాలలో గిరిజనేతరులు స్థిరపడ్డారు. భూములు ఆక్రమించారు. ఇవి తమతాతముత్తాతలు అక్రమవడ్డీలకు, మాయ మాటలకు పోగొట్టుకున్న భూములని, ఇవి ఎప్పటికైనా తమకే చెందాలని గిరిజనుల వాదన. అది చాలవరకు నిజంకూడా. పర్వతప్రాంతాలైన మన షెడ్యూల్డు ఏరియాలో ప్రతిమండలంలో సగంపైగా రిజర్వు అడవి. దాంట్లోకి ఎవరూ ప్రవేశించరాదు. మిగిలిన సగభాగం భూమిలో సారవంత మైన భూములన్నీ గిరిజనేతరులు ఆక్రమించుకున్నారు. ఇక 10 శాతం లేదా 20 శాతం మిగులు భూములు: అవీ వట్టి బంజర్లు. వీటిలో గిరిజనుడు ఎలా బతకగలడు ? ఇటువంటి బంజర్లు పడావు భూములను అంటగట్టడానికి "తెలుగు గిరిజన మాగాణి సమారాధన" అని పేరు పెట్టారు.

భూమికోసమే గిరిజనులంతా ఏకమై నక్సలైట్లతో చేతులు కలిపి శ్రీకాకుళం జిల్లాలో పోరాటం సాగించారు. కాంగ్రెసు పాలకులు ఈ ఉద్య మాన్ని చాలా అమానుషంగా అణచివేశారు. కాని గిరిజనుల ఆందోళన, నక్సలైట్ల ప్రోత్సాహం. కేవలం శాంతిభద్రతల సమస్యలు కావని వారు అర్థంచేసుకోగలిగారు. అందువల్లనే వారు గిరిజన ప్రాంతంలో భూములు, తాము చట్టసమ్మతంగా సంపాదించినవేనని నిరూపించుకోవలసిన బాధ్యత గిరిజనేతరుడిదే - ఫిర్యాదు చేసే గిరిజనుడు ఎటువంటి కాగితాలు దాఖలు

చేయనక్కరలేదు అని. అలాగే 1917, 1959 (ఆంధ్ర) 1949, 1963 (తెలంగాణా) సంవత్సరాల చట్టాలకు విరుద్ధంగా చేసుకుంటున్న భూముల నుండి గిరిజనేతరుడిని తొలగించాలని. అంతేకాక సక్రమంగా సంపాదించిన భూములైనాసరే. ప్రభుత్వానికి, గిరిజనుడికి తప్ప, ఇంకో గిరిజనేతరుడికి గిరిజనేతరుడు భూమి అమ్మరాదు అని 1970 చట్టంద్వారా ఆంక్షలు విధించారు. భూమికోసం గిరిజన ప్రాంతాలలోకి వలస పోకుండా చట్టరీత్యానన్నా కనీసం అడ్డువేశారు.

## గిరిజనేతరులకు మాగాణీ సమారాధన

అయితే ఆచరణలో ఈచట్టం గట్టిగా అమలు జరగకుండా అధికారులకు పగ్గాలువేస్తూ వచ్చారు కాంగ్రెస్‌వారు. 1952 లో ఎస్టేట్లరద్దు 1969లో ముఠా, మహల్ రద్దుల తరువాత, ఏజన్సీ ప్రాంతంలో 1970 లో జరిగిన సర్వే అండ్ సెటిల్మెంటులో అమాయకులైన గిరిజనులను మోసపుచ్చి ఈ గిరిజనేతర ఆక్రమణదారులు సెటిల్మెంటు పట్టాలు సంపాదించుకొని తాముకాజేసిన భూములకు తిరుగులేని హక్కులు సంపాదించుకున్నారు. భూములులేని గిరిజనులున్న గ్రామాలలోనే, అగ్రవర్ణాల గిరిజనేతరులు ప్రభుత్వ భూములకు "డి" నమూనా పట్టాలుకూడా సంపాదించుకున్నారు.

వీరంతా తమ భూములు స్వేచ్ఛగా గిరిజనేతరులకు అమ్ముకోవడానికి వీలుగా 70 చట్టం రద్దుచేయించాలని కోర్టులచుట్టూ తిరిగి విఫలమయ్యారు. కోర్టులంటే ఏమాత్రం గౌరవంలేని మన ముఖ్యమంత్రి ఈ భూబకాసురులకు ఒక పెన్నిధిలా దొరికారు. "గిరిజనేతర మాగాణి సమారాధనకు" ఆయన ప్రయత్నాలు ప్రారంభించారు.

## రాజ్యాంగం విధించిన సంప్రదాయాలను తోసిపుచ్చారు

భారత రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు ప్రకారం, షెడ్యూల్డు ప్రాంతాల పరిపాలన, చట్టాలు గవర్నర్ విచక్షణాధికారాలకు సంబంధించి

నవి. తన దృష్టికి వచ్చిన విషయాలమీద గిరిజన శాసనసభ్యులు సహకార సంఘం సలహా. గవర్నర్ తీసుకుంటారు. గవర్నర్ యీ సలహాను పాటించవలసిన నిర్బంధం ఏమీలేదు. మొదట్లో ఈ సలహాసంఘానికి గవర్నరే అధ్యక్షత వహించేవారు. కాలక్రమేణా ఎటువంటి రాజ్యాంగ పరమైన అనుమతి లేకుండానే. గిరిజన సంక్షేమశాఖ మంత్రి ఈ సమావేశానికి అధ్యక్షత వహించే ఆచారం చోటు చేసుకున్నది.

రాజ్యాంగ విరుద్ధమైన ఈ ఆచారాన్ని చూసి, గిరిజన శాసనసభ్యుల సంఘం ఏదో ప్రభుత్వశాఖకు అనుబంధంగా ఉండే నామమాత్రపు సలహా సంఘం అని రాష్ట్రప్రభుత్వం భావించింది. అన్ని సామంత (మిత్ర) పక్షలను ఒప్పించామని భ్రమపెట్టి గిరిజన శాసనసభ్యులు 16 గురులో ముగ్గురి చేత తీర్మానానికి అంగీకరింపచేసి, మంత్రిమండలి ఈ 70 చట్టం రద్దును గవర్నరు ఆమోదానికి పంపుతున్నట్లు ప్రకటించారు. మంత్రిమండలి నిర్ణయాన్ని గవర్నర్ ఆమోదించాలని ప్రజలకు భ్రమ కల్పించారు.

అసలు మంత్రి మండలికి, షెడ్యూల్డు ప్రాంతాల చట్టాలకు సంబంధించినంతవరకు ఏమీ సంబంధంలేదు. ప్రభుత్వానికి ఏజెంటుగా జిల్లాలో షెడ్యూలు ఏరియా పరిపాలనచూసే జిల్లాకలెక్టరు నివేదికలు, తన సూచన మేరకు గిరిజన శాసనసభ్యుల సంఘం సలహాలు- వీటిమీద ఆధారపడి, తన విజ్ఞతను ఉపయోగించి షెడ్యూల్డుప్రాంతం చట్టాలు రాష్ట్రం మొత్తానికి వర్తించే చట్టాలు, ఏజెన్సీకి కూడా వర్తిస్తాయి అని సంతృప్తి చెందికాని లేదా మార్చికాని గవర్నర్ ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీచేస్తేనే అవి షెడ్యూల్డు ప్రాంతానికి వర్తిస్తాయి. లేకపోతే వర్తించవు. గవర్నర్లుకూడా రాష్ట్రవ్యాప్తంగా అమలులోకి రానున్నచట్టం గిరిజన ప్రాంతాలకు వర్తింప చేసేటప్పుడు ఏదైనా మార్పులు చేయాలా, లేదా అని ఆలోచించడం, ప్రత్యేకంగా నోటిఫికేషన్ జారీచేయడం విస్మరించాలి. వారు కళ్లుండీ కూడా కబోదులైనారు.

ఉదాహరణకు :- భారతీయ శిక్షాస్మృతి కొత్తనిబంధనలు 1976 నుండి దేశమంతటా అమలులోకి వచ్చింది. కాని ఏజెన్సీలో ఇంకా పాత నిబంధనలే అమలులో ఉన్నాయి. కొత్త నిబంధనలు ఏజన్సీకి వర్తిస్తాయి అని నోటిఫికేషన్ జారీచేయలేదు. పాత నిబంధనల ప్రకారం ఉంపుడు గత్తెలకు, భర్త భరణం ఇవ్వవలసిన అవసరంలేదు. అందువలన గిరిజనే తరుల చేత మోసగింపబడిన గిరిజన స్త్రీలకు భరణం లభించటంలేదు. ఇలా ఏజెన్సీ ప్రాంతాలకోసం ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి కొంతకాలం ఇవ్వ కుండా చట్టాలు యధాతధంగా అమలుపరచి కొంతకాలం చాలా గందరగోళ పరిస్థితిని సృష్టిస్తున్నారు.

ముఖ్యమంత్రికి మంత్రిమండలికి సంబంధంలేని పెత్తనం నెత్తిన వేసుకొని, గిరిజన శాసనసభ్యుల మండలి మెడలు వంచారని, గవర్నర్ గిరిజన శాసన సభ్యులను సంప్రదించవలసి ఉండగా, గిరిజన శాసన సభ్యు లను మంత్రిమండలి తన అఖిలపక్ష తీర్మానాలద్వారా బలవంతపెట్టిందని వారిని స్వేచ్ఛగా ఆలోచించనివ్వలేదని ఈ పద్ధతిని ఎవరో ఒకరు కోర్టులో సవాలు చేస్తారు. ఈ చట్టం రద్దు క్రమాన్ని కోర్టులు తోసిపుచ్చే అవకాశా లున్నాయి.

## గిరిజనులకు పనికివచ్చే తీర్మానాలు బుట్టదాఖలు చేశారు

70 చట్టం రద్దుకు ఆమోదించిన నాడే, సెటిల్మెంటు పట్టాలను రద్దు చేసే డైరెక్టర్ ఆఫ్ సెటిల్మెంటు అధికారాలు కలెక్టరులకు ఇమ్మని, గిరి జన శాసనసభ్యుల సంఘం మరో తీర్మానం చేసింది. భూ బకాసురుల పట్టాలు రద్దుచేసే ఆ తీర్మానాన్ని ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది.

మార్కెట్ ధర ఇస్తే, భూములు ప్రభుత్వానికి అమ్మకొని గిరిజన ప్రాంతాలు ఖాళీచేస్తాం అని గిరిజనేతర నాయకుడు మాజీమంత్రి జి. పి.

సుధాకరరావు అన్నారు. గిరిజనేతరుల నుండి భూములు కొనడానికి, ప్రతి సంవత్సరం కొంతసొమ్ము బడ్జెట్‌లో కేటాయిస్తామని, గిరిజన శాసన సభ్యుల సమావేశంలో అధికారులు చెప్పినట్లు కూడా తీర్మానపాఠంలో ఉంది. కాని ముఖ్యమంత్రి ఇలా కొనడానికి ప్రభుత్వందగ్గర నిధులులేవు అన్నారు. నక్సలైట్ల పునరావాసానికి నిమిషాల్లో డబ్బు సర్దగల ముఖ్య మంత్రికి గిరిజనేతరుల భూములు కొనడానికి నిధులు లేవు. ఏజెన్సీలో ఈ ప్రభుత్వం కట్టించే పక్కా ఇళ్ళకు బదులు, ఆ సొమ్ముతో ఎంతో కొంత మంచి భూమికొని ఇప్పించవచ్చు. గిరిజనుడు ఏదో కర్ర కంపతో ఇల్లు కట్టుకోగలడు. భూమి అమరితే రైతు తనకుదగ్గ ఇల్లు తాను కట్టుకోగలడు.

గిరిజన ప్రాంతంలో భూమి తగవులను హైకోర్టు పరిధినుండి తొల గించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూలులో చేర్చాలని ఆనాడే గిరిజన శాసన సభ్యులు మరో తీర్మానం చేశారు. దాని ఊసే తరువాత ఎత్తలేదు. గిరిజ నేతరుల మీద అభిమానంతో 1/70 చట్టం రద్దు లేకపోతే రీనోటిఫికేషన్ అని వాదించే ముఖ్యమంత్రి గిరిజనులకు పనికొచ్చే ఈ రెండు తీర్మానాలను కేంద్రానికి ఎందుకు నివేదించలేదు. ఆయన గిరిజనేతర పక్షపాత ధోరణికి ఇది నిదర్శనం.

70 చట్టం రద్దు తలపెట్టడం సాంఘిక న్యాయానికి వ్యతిరేకంఅంటూ ముఖ్యమంత్రి అవలంభించిన పద్ధతులు, ఆడిన అబద్ధాలు, మేధావులు, పత్రికలు, పౌరహక్కుల సంఘాలు ఆఖరుకు మిత్రపక్షాలు కూడా తీవ్రంగా నిరసించాయి. కాబట్టి ఈపని ముఖ్యమంత్రి దొడ్డిదారిన సాధించే ప్రయ త్నాలు మొదలు పెట్టారు.

## గిరిజనులకు ఏం తక్కువైందని రీనోటిఫికేషన్?

షెడ్యూల్డు ఏరియాలోనే, గిరిజనేతరులు అధికంగా చేరిన పట్టణాలు భద్రాచలం, కుకునూరు, నెల్లిపాక, అశ్వారావుపేట, పోలవరం, పురుషోత్త

పట్నం మొదలైన పంచాయితీలను డీ రిజర్వుచేశారు. ఫలితంగా అక్కడ గిరిజనులే సర్పంచులు. అలాగే 50 శాతం మించిన గిరిజనేతర జనాభాగల గ్రామాల్లో ప్రభుత్వ సారాపాటలు పెట్టారు. ఇలా షెడ్యూల్డు ఏరియా అనే ప్రతిపత్తి ఉండగానే ఎక్కడెక్కడ గిరిజనేతరులు అధికంగా చేరారో వారి ప్రయోజనాలు రాష్ట్రప్రభుత్వం కాపాడుతూనే ఉంది. కాని గిరిజనులు ఇప్పటికీ అధికసంఖ్యలో ఉండే. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 785 గ్రామాలను గిరిజన గ్రామాలుగా ఏ ప్రభుత్వం ప్రకటించలేదు. ఉదాహరణకు ఇటువంటివి 80 గ్రామాలు తూర్పుగోదావరి జిల్లాలో ఉన్నాయి. శంఖవరం మండలంలో 30 గ్రామాలు కోటనందూరు, ఏలేశ్వరం, జగ్గంపేట, గోకవరం మండలాలలో పదేసి గ్రామాలు ఆదినుండి గిరిజన జనాభా అధికంగా గల గ్రామాలు.

## ముఖ్యమంత్రి అబద్ధాల కోరు

జూలై 2న ముఖ్యమంత్రి భద్రాచలం డివిజన్‌లో గిరిజనులు లేరు అని శలవిచ్చారు. గిరిజన గిరిజనేతర జనాభా ప్రాతిపదికగా షెడ్యూల్డు ఏరియాగా విభజించడానికి రీనోటిఫికేషన్ ప్రతిపాదన పంపామని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రజలను నమ్మించడానికి అబద్ధాలుచెప్పే స్థితికి దిగజారారు.

భద్రాచలం డివిజన్ జనాభా లెక్కలివి

| ఖమ్మంజిల్లా | మొత్తజనాభా 1981 | మొత్తజనాభా 1971 | గిరిజనులు 1981 | గిరిజనులు 1971 |
|---|---|---|---|---|
| నూగూరు తాలూకాలో | 69,409 | 52,535 | 28,651 | 22,735 |
| భద్రాచలం తాలూకాలో | 1,46,449 | 1,16,502 | 73,129 | 58,834 |
| భద్రాచలం టవున్‌లో | 21,354 | 10,710 | 892 | 229 |
| బూర్గంపాడు | 72,818 | 52,612 | 28,482 | 13,577 |

| | | | | |
|---|---|---|---|---|
| మణుగూరు తాలూకాలో | 89,153 | 61,614 | 29,753 | 21,318 |
| ఎల్లందు తాలూకాలో | 1,13,118 | 93,780 | 40,569 | 10,524 |
| ఎల్లందు టౌనులో | 27,292 | 16,767 | 1,487 | 189 |
| కొత్తగూడెం తాలూకాలో | 2,65,097 | 1,96,380 | 57,963 | 15,794 |
| కొత్తగూడెం టౌన్‌లో | 94,894 | 75,542 | 5,207 | 1,550 |
| పాల్వంచ టౌన్‌లో | 39,116 | 18,234 | 5,709 | 1,714 |

గమనిక :- 1971 తరువాత లంబాడీవారిని షెడ్యూల్డు తెగగా ప్రకటించారు. అందువల్ల 1981 లెక్కల్లో వారి జనాభా కలిసి మొత్తంజనాభా బాగా పెరిగింది.

## ఏజెన్సీలో కాలేజీసీట్లు దిగువవారికే

ఏజెన్సీ ప్రాంతాలలోని పట్టణాలలో మాత్రమే గిరిజనులు తగ్గిపోయారు. కారణం మార్కెట్ శక్తుల ప్రభావం, గిరిజనప్రాంతంలోని ప్రయివేట్, ప్రభుత్వ పరిశ్రమలలో గిరిజనులకు ఉద్యోగావకాశాలు రిజర్వేషన్ పూర్వకంగా అమలు జరుగకపోవడం, ఉద్యోగాలకు తగిన నైపుణ్యం, అర్హతలు కలిగించకపోవడం, విద్యారంగంలో అంతే ఏజన్సీలోని జూనియర్ డిగ్రీకళాశాలలలో గిరిజనులజనాభాకు తగిన రిజర్వేషన్‌లు ఇవ్వలేదు, అన్ని ప్రాంతాలలో ఉండే కనీస రిజర్వేషన్ సీట్లు మాత్రమే గిరిజన విద్యార్థులకు ఇవ్వడంతో, ఈ కళాశాలలో కూడ గిరిజనేతరులే ఎక్కువ సీట్లు సంపాదిస్తున్నారు, అత్తెసరు మార్కులతో పాసయ్యే గిరిజనులకు సీట్లు దొరకడంలేదు.

## దిగువవారికి పెత్తనమిచ్చిన చట్టాలు - సంస్థలు

అంతేకాక సహకారరంగంలో, కర్షకపరిషత్ నిర్మాణంలో ప్రభుత్వం గిరిజనులను విస్మరించి - గిరిజనేతరులు పదవులలోకి వచ్చే అవకాశాలు కల్పించారు.

1963 సహకార చట్టప్రకారం, ప్రతి సహకార సంఘంలోని 13 డైరెక్టర్లతో 8 డైరెక్టరు పదవులు బహిరంగపోటీకి 3 స్థానాలకు షెడ్యూల్డు కులాలవారు, 2 స్థానాలకు షెడ్యూల్డు తెగలవారికి కేటాయించారు. ఇదే చట్టాన్ని గిరిజన ప్రాంతానికికూడా యధాతధంగా వర్తింపచేశారు. గిరిజనులు అధికసంఖ్యలో ఉండే ఏజెన్సీలో అధికశాతం డైరెక్టరు పదవులు గిరిజనులమధ్య పోటీకి, ఒకటి రెండు సీట్లు గిరిజనేతరులకు బహిరంగ పోటీకి వదిలేయాలి. అలా షెడ్యూల్డు ఏరియాకు తగినట్లు ఈచట్టం సవరించనందువల్ల, గిరిజనేతరులే ఈ పదవులకు ఎన్నికై, ఈ బ్యాంకులలో గల పరపతి సౌకర్యాలను బాగా వినియోగించుకుంటున్నారు. అధికసంఖ్యలో గల గిరిజన లబ్ధిదార్లను, సభ్యులను దగా చేశారు.

1987 లో సింగిల్‌విండో ఎన్నికలు జరిగినపుడుకూడా, అధికారులు పదేపదే చెప్పినప్పటికీ ఈచట్టం ఏజన్సీకి తగినట్లు సవరించలేదు. వాటితో పాటు గిరిజన సహకార కార్పొరేషన్‌లో భాగస్వాములైన సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. కర్షక పరిషత్‌లో అసలు రిజర్వేషన్‌లే లేవు. ఏ రాజకీయ పక్షమూ ఈ విషయాలు పట్టి చుకోనే లేదు.

## వెనుకదగా - ముందుదగా, కుడి ఎడమల దగాదగా

ఇలా స్థానిక పరిపాలనలో - పరిశ్రమలలో, ఉన్నత విద్యలో ఏ ప్రభుత్వం గిరిజనుల కిచ్చిన చేయూత లేదు. ఈ అవకాశాలన్నీ గిరిజనేతరులకే ఉపయోగపడ్డాయి - వారి జనాభా పెరిగింది. వాళ్ళ పరిశ్రమలకు, ఇళ్ళకు, ఫర్నీచరుకు గిరిజనులకు ఆశ్రయమైన అడవులు ఆహుతి అయిపోయినాయి. ఇలా గిరిజనేతరుల జనాభా పెరిగిన ప్రాంతాలను షెడ్యూల్డు, ఏరియానుండి మినహాయిస్తూ పోతే, గిరిజనుల హక్కులకు సున్నాచుడితే, దీనికి అంతెక్కడ ? వచ్చే పదేళ్ళలో షెడ్యూల్డు ఏరియా అంటూ వుంటుందా ? అడవి అంటూ మిగులుతుందా ? రీనోట్ఫై చేస్తారనే ఆశ వుంటే గిరిజనేతరులు అడ్డూ అపూ లేకుండా ఏజన్సీలోకి వలసపోతారు, జనాభా పెంచుకుంటారు.

## కలపదొంగల గుప్పిట్లో ప్రభుత్వం

ఏజన్సీలోని వేలాది ఎకరాల దట్టమైన అడవి భూములకు కాంగ్రెస్ హయాంలో పట్టాలను తెచ్చుకొన్నారు గిరిజనేతరులు. ఆ పట్టాలను రద్దు చేస్తే ప్రభుత్వానికి దక్కే అడవులను, ఏ తెలుగుగంగ, పోలవరం ఆనకట్ట కిందమునిగే అడవులకు ప్రత్యామ్నాయంగా కేంద్రానికి ఇవ్వవచ్చు. ఈ పట్టాలను రద్దుచేయడం మాని, ప్రభుత్వం చెట్లునరకడం మీద నిబంధనలు విధించారు. దానిమీద పట్టాదార్లు కోర్టుకెళ్లారు. పట్టాలను రద్దుచేయకుండా అడ్డుకోడంలో పాలకవర్గాల పాత్ర ఉంది. కోర్టులో పట్టాదార్లు గెలిస్తే అడవులు పోతాయి. కోర్టులో ప్రభుత్వం గెలిచినా భూములు వారివే దొంగ తనంగా అడవి నరుక్కుపోతారు. రోగమొకపైతే మందు ఒకటి వేసి అదే మంచే మా బాధ్యతలేదు. కోర్టులు అలావున్నాయి అని తప్పించుకోవడం ఈ ప్రభుత్వానికి అలవాటే.

## కాలవలు కొండప్రాంతంలో - ఆనకట్టలు దిగువప్రాంతానికి

ఏజెన్సీలో జలవనరులను తరలించడంలో ప్రస్తుత ప్రభుత్వంకూడా కాంగ్రెస్‌వారికి తీసిపోలేదు. కొండల్లో ప్రవహించే ఏలేరు నీళ్ళను ఉక్కు ఫ్యాక్టరీకి మళ్ళించాడు చెన్నారెడ్డి. తన పేరున తారకరామ ఆవ అని ప్రక టించి గోదావరి ఏజన్సీలో నేలకోటలోని అందాల చెరువును పూర్తిగా గిరి జనేతరులకు కట్టబెట్టారు మన ముఖ్యమంత్రి.

మహారాష్ట్రలోని బీడిఆకులు, ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చి అమ్ము కోడానికి వి. పి. సింగును ముఖ్యమంత్రి ఆహ్వానించారు. మరి మన రాష్ట్రంలో గిరిజన సహకార కార్పొరేషన్. చింతపండుకు చెల్లిస్తున్న రేటు ఎంత? ఈఏడు కార్పొరేషన్ కేజీకి గిరిజనులకు చెల్లించిన ధర రు. 4-40 పైసలు. ఏపట్టణంలో చూచినా చింతపండు కేజి రు. 16 కి తక్కువలేదు. మరి గిరిజనుడికి ఇంత తక్కువధర ఎందుకు ముడుతున్నది.

# స్వార్థమే తప్పు - గిరిజనుల సమస్యలు పట్టని జాతీయ ప్రాంతీయ పార్టీలు

రంపపితూరీ, రామరాజు పితూరీల నాటినుండి గిరిజనులకు సాయుధ పోరాటమే అలవాటు. స్వాతంత్ర్యం వచ్చాకకూడా ఆ వారసత్వమే నక్సలైట్ల నాయకత్వంలో కొనసాగుతున్నది. తెలుగుదేశం పాలనలో గిరిజన ప్రాంతంలో పెట్టినన్ని పోలీసు అవుట్‌పోస్టులు ఎన్నడు లేవు. గిరిజనులు ఎన్‌కౌంటర్లులలో ఇంత పెద్దఎత్తున ఇంతకుముందు చనిపోలేదు. గిరిజనులలో స్థానిక నాయకత్వం లేనందువల్ల చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా వారు నక్సలైట్ల ప్రమేయంకోసం ఎదురుచూస్తున్నారు. కూలీ పెంచని పరిశ్రమలు, కూలి ఎగ్గొట్టే కాంట్రాక్టర్లు, హింసించే సారా వ్యాపారస్తులు, పీడించే వడ్డీ సావుకార్లు, పిల్లలు పుట్టాక గిరిజనస్త్రీలను వదిలేసి మోసగించే గిరిజనేతరులు, పోలీసు అవుట్‌పోస్టులలో వెట్టిచాకిరి చేసేవాళ్లు, నిర్బంధాలకు గురైనవాళ్లు, కనీసం ఈ సమస్యలనుకూడా తీర్చడం పట్టని వాళ్లు ఏజన్సీలో వున్న మన జాతీయపార్టీల నాయకులు. వారంతా గిరిజనేతరుల చేతిలో పాచికలు. గిరిజనులకుండే సాధారణ సమస్యలు ఇవే. గిరిజన ప్రాంతాలలో అధిక సంఖ్యాకులు మండలాధ్యక్షులు, ఎమ్.ఎల్.ఎ.లు పాలకవర్గంవారే ఉండగా, ఈ చిన్న సమస్యలకోసం నక్సలైట్లను గిరిజనులు ఆశ్రయించడం జాతీయ పార్టీలకు, ముఖ్యంగా అధికారపార్టీకి సిగ్గుచేటు.

## అధికారులంటే కంటగింపు

సమస్యలు చిత్తశుద్ధితో తీర్చే అధికారులను చూసి ఓర్వలేనివాళ్ళు ఈ పాలకవర్గం నాయకులు. వారి ఆలోచనలకు వంతపాడని సాంఘిక సంక్షేమ కార్యదర్శి శ్రీ ఎస్. ఆర్. శంకరన్‌ను, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టరు ఎమ్. పి. పి. సి. శాస్త్రిని ఆ శాఖలనుండి కదిలించారు.

సారా కాంట్రాక్టర్ల మెప్పుకోసం, పాడేరు ప్రోజెక్టు ఆఫీసరును, సబ్‌కలెక్టరును బదిలీచేసారు. పోలీసుల వత్తిడిమీద ఆదిలాబాద్ జిల్లా కలెక్టరును బదిలీచేశారు. భూబకాసురులు మణుగూరులో చేసిన అరాచకాన్ని వెంటేసుకుని వచ్చి, ఆ జిల్లా కలెక్టరును బదిలీచేశారు. ప్రక్కనే ఉన్న గిరిజనేతర ప్రాంతంలో భూములుకొని గిరిజనులకు పంచిపెట్టాలని ప్రయత్నించిన తూర్పుగోదావరి ప్రోజెక్టు ఆఫీసరును హఠాత్తుగా బదిలీ చేశారు. ఒక సబ్‌కలెక్టరు మీద చేజేసుకోబోయాడు ఒకమంత్రి. ఎంతో మారుమూల ప్రాంతాలలో గిరిజనులను కలిసి వస్తూన్న అధికారులు కిడ్నాప్ అయిన వార్తవిని పాలకపార్టీ నాయకుడు చంద్రబాబునాయుడు వాళ్లు అంతలోపలికి ఎందుకు వెళ్లారు అంటూ తప్పంతా వాళ్ళదే అన్నట్లు మాట్లాడారు. ఇదే అధికారపార్టీకి చట్టాలమీద, గిరిజనులమీద, వాళ్ళకోసం పనిచేసే అధికారులమీద వున్న అభిమానం.

ఏజెన్సీ ప్రాంతాలలో న్యాయశాఖకు చెందిన న్యాయస్థానాలు లేవు. సబ్‌కలెక్టర్లు సబ్ డివిజనల్ మెజిస్ట్రేటుగా, యం. ఆర్. ఓ. లు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటులుగా, కలెక్టరు, జిల్లా మెజిస్ట్రేటుగ సివిల్, క్రిమినల్ వివాదాలను పరిష్కరిస్తూ వుంటారు. కోర్టు నాలుగు గోడలమధ్య ప్లీడరు జడ్జీల వాగ్వాదాలకు అలవాటుపడని గిరిజనుడు హడలిపోతాడు. అందువల్ల ఎగ్జిక్యూటివ్ అధికారులే న్యాయమూర్తులుగా వ్యవహరించే అవకాశం రెవిన్యూ అధికారులకు ఇచ్చారు. వారు గ్రామాలకువెళ్లి ప్రజల మధ్య కోర్టు నిర్వహించవలసిందిగా ఉత్తర్వులు కూడా ఉన్నాయి. ఇటువంటిది తెలంగాణాకు కూడా వర్తింపచేయమని అడిగితే అప్పటి హోమ్ మంత్రి శివప్రసాద్, ఆంధ్రప్రాంతంలో ఈ ఎగ్జిక్యూటివ్ పద్ధతిని తీసివేసి న్యాయవ్యవస్థను ప్రవేశపెట్టే ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. కొండనాలుకకు మందు వేయమంటే ఉన్ననాలుక తీసివేస్తాను అన్నట్లు ఉంది ఈ వరస. ఇంతవరకు తెలంగాణాలో ఈ అధికారాలు ఇవ్వలేదు. అదృష్టవశాత్తు ఆంధ్రాలో తీసివేయలేదు. అందుకు సంతోషం. ఆదర్శభావాలుగల కొందరు కలక్టర్లు, సబ్ కలెక్టర్లు, అధికారపార్టీ నాయకుల మాటవినటం

లేదు. అందువలన వారి అధికారాలు తగ్గించి మామూలు కోర్టులు గిరిజన ప్రాంతములో పెట్టి, గిరిజనులను లిటిగేషన్ పాలుచేసి, బలహీన పరచాలని ఈ పార్టీనాయకుల ఉద్దేశం.

ఆదిలాబాద్ జిల్లాలో కులపెద్దల నాయకత్వములో నడుస్తున్న "రాయ్‌సెంటర్ల"తో ఈ రాజకీయ పార్టీలవారు తగాద పడుతున్నారు. గిరిజనుల సంస్కృతి రక్షించడం అంటే ఇదేనా.

ప్రస్తుత ప్రభుత్వంలో చాలామంది గిరిజనులను ఉపాధ్యాయులుగా ఉద్యోగస్తులుగా నియమించింది. పౌర సరఫరాలను గిరిజన కార్పొరేషన్ ద్వారా మెరుగు పరచింది. అనేక గురుకుల పాఠశాలలను నెలకొల్పింది. ఇది మంచిదే.

## గిరిజనులను రెచ్చగొట్టిన ముఖ్యమంత్రి

తరతరాలుగా గిరిజనులకు జరిగిన అన్యాయాలను ప్రస్తుత నాయకత్వం సరిదిద్దలేదు సరికదా, వారికి రావలసిన భూములను మరొకరికి అప్పగింతలు పెట్టే తిరోగమన చర్యలకు శ్రీకారం చుట్టింది. అప్పుడు అన్యాయంగా బలపడిన వారందరికీ పాస్‌పోర్టులు ఇవ్వాలని కష్టపడిపోతున్నది. ఫలితంగా, ఈనాడు ఇదివరలో లేని చైతన్యం, తిరుగుబాటు ధోరణి గిరిజనులలో కనిపిస్తుంది. 1/70 చట్టం రద్దుప్రయత్నాలు, ఎక్కడికక్కడ తెగలు తెగలుగా విడిపోయిన గిరిజనులందరిని ఐక్యం చేసింది. ఒకనాడు అణగిమణిగి వున్నవారు ఈనాడు బుసలుకొడుతున్నారు. ప్రభుత్వ చర్యలు మేధావులను కూడా కదిలించాయి.

## మేధావుల హెచ్చరిక

ప్రఖ్యాత మానవశాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎన్. సుబ్బారెడ్డి (సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్‌స్టడీస్) రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూలు ద్వారా రాష్ట్రంలోని గిరిజనుల హక్కులను కాపాడలేకపోతే, ఆరవ షెడ్యూలుద్వారా ప్రత్యేక ప్రతిపత్తిగల పర్వత ప్రాంతాలను (హిల్ కౌన్సిల్) ఏర్పాటు చేయవలసి వస్తుంది. అని హెచ్చరించారు.

వివిధ ప్రాంతాలలో గిరిజనులు, ఇతరతెగల హక్కులు మరింతగా గుర్తిస్తున్న రోజులివి. పశ్చిమబెంగాల్‌లో గూర్ఖాలాండ్ అవతరించింది. ఇవేళో రేపో జార్ఖండ్-బోడోలాండ్ అవతరించ నున్నాయి. ప్రభుత్వం రీనోటిఫికేషన్ అంటే, పైతరహాలో మాకు ప్రత్యేక పాలనా ప్రతిపత్తి కావాలని గిరిజనులు ఆందోళన చేసే అవకాశం ఉంది. యం. సి. పి. ఐ. నాయకుడు ఓంకార్ ఏనాడో ఇటువంటి పిలుపునిచ్చారు.

## భూమి సమస్య - జాతీయ సమస్య

స్థానికుల భూములు అన్యాక్రాంతం కావడం ఒక గిరిజన ప్రాంతంకే పరిమితం కాదు. కోస్తాజిల్లాల రైతులు, కర్ణాటకలోని బళ్లారి, హాస్పేట జిల్లాలలో తుంగభద్ర డామ్ కింద భూములు కొనుక్కొని పెద్దరైతులైనారు. కమ్మవారు కర్ణాటకలో వెనుకబడిన వర్గాలకు చెందినవారు. ఆ లాభాలు అక్కడకు వెళ్లిన మన రైతులు పొందుతున్నారు. అలాగే నిజామాబాద్, హైదరాబాదులలో ఆంధ్రులు పెద్దఎత్తున భూములు కొన్నారు. ఉద్యోగాలు సంపాదించారు. ఈ అసమానత వల్ల జై తెలంగాణా ఉద్యమం వచ్చింది. అభివృద్ధి పథంలో పేదల వనరులు చేతులు మారుతున్నాయి.

నేషనల్ ఫ్రంట్‌కు అధ్యక్షుడు మన ముఖ్యమంత్రి. ఈభూమి సమస్యకు జాతీయస్థాయిలో ఫ్రంట్‌యొక్క అవగాహన ఏమిటి? ఈ అసమానతలను ఆక్రమణలను ఫ్రంట్ ఎలా చక్కదిద్దుతుంది. ఫ్రంట్ మానిఫెస్టో తెలుగుదేశం వారే తయారుచేసి పంచిపెట్టారు. దాంట్లో భూమి సమస్య గూర్చి ఏం వ్రాశారో.

## ప్రజలే నిలదీసి అడగాలి

దానిసంగతి సరే - షెడ్యూల్డు ఏరియా రీ నోటిఫికేషన్ గూర్చిన ప్రతిపాదనల పూర్తిపాఠం చర్చకు పెడతారా - ప్రకటిస్తారా? 70 చట్టం రద్దు ప్రయత్నాలు ఏదశలో ఉన్నాయో తెలియపరుస్తారా? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పమని ప్రజలే ఓట్లకోసం వచ్చే నాయకులను నిలదీసి అడగాలి.

# షెడ్యూల్డు/షెడ్యూల్డు కాని ప్రాంతాలలో గిరిజనుల గ్రామాలు, జనాభా 1981

| ఐ. టి. డి. ఎ. | వైశాల్యం చ.కి.మీ. | గ్రామాల సంఖ్య షెడ్యూల్డు | షె.కానివి | మొత్తం | జనాభా మొత్తం | గిరిజనులు | గిరిజనుల శాతం | ఐ. టి. డి. ఎ. కార్యాలయం |
|---|---|---|---|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 1289.32 | 108 | 240 | 348 | 31,120 | 29,100 | 93,50 | సీతంపేట |
| విజయనగరం | 1740.98 | 299 | 172 | 471 | 52,775 | 38.564 | 37.07 | పార్వతీపురం |
| విశాఖపట్నం | 5904.51 | 3435 | 86 | 3521 | 2,77,404 | 2,39,900 | 85.00 | పాడేరు |
| తూర్పుగోదావరి | 4191.65 | 559 | 40 | 599 | 1,32.736 | 88,628 | 85.75 | రంపచోడవరం |
| పశ్చిమగోదావరి | 1006.10 | 102 | 4 | 106 | 64.551 | 29,887 | 46.22 | కన్నాపురం |
| ఖమ్మం | 6899.92 | 892 | 3 | 895 | 6,62,591 | 1,67,697 | 25.31 | పాల్వంచ |
| వరంగల్ | 3122.46 | 177 | 77 | 254 | 1,08,940 | 29,229 | 26.83 | ఏటూరునాగారం |
| ఆదిలాబాద్ | 6138.50 | 412 | 163 | 575 | 1,40,352 | 73,713 | 52.52 | ఉట్నూరు |
| మొత్తం | 30293.44 | 5984 | 785 | 6769 | 14,70,589 | 6,95,484 | 47.29 | |

ఆధారం :- ముఖ్య గణాంక వివరాలు : గిరిజన సంక్షేమశాఖ. జూలై 1986.